మట్టిరోడ్లకు మహర్దశ

మట్టిరోడ్లపై రాకపోకలు సాగించేందుకు నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల ప్రజలు నానా అవస్థలుపడుతున్నారు. వర్షాకాలంలో వారి అవస్థలు వర్ణనాతీతం. అడుగుకోగుంత ఉండటంతో ఈ రోడ్లపై ప్రయాణించాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే. తమ గ్రామాలకు బీటీ రోడ్లు వేస్తే బాగుంటుందని దశాబ్దాలుగా కలలుకన్నారు. వారి కలను నిజం చేస్తూ బీటీ రోడ్ల నిర్మాణానికి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి నిధులు మంజూరు చేశారు. తమ కల సాకారం కాబోతున్నందుకు సంబరపడుతున్నారు.

- గుంతలమయంగా మారిన రహదారులు
- బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.20.54 కోట్లు మంజూరు
- త్వరలో ప్రారంభంకానున్న పనులు


గుంతలతో అధ్వాన్నంగా ఉన్న వర్ధరాజుపల్లి రోడ్డు

దుబ్బాకటౌన్: దుబ్బాక నియోజకవర్గంలోని రోడ్లకు మహర్దశ పట్టనుంది. గుంతలమయంగా ఉండే మట్టి రోడ్లపై ప్రయాణించాలంటే నానా తిప్పలు పడేవారు. తమ గ్రామాలకు బీటీ రోడ్లు వేయాలని ఎన్నో ఏళ్ల నుంచి మొరపెట్టుకుంటుంటే ఇప్పటికి వారి మొర ఆలకించి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. నియోజకవర్గంలో పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోని పది గ్రామాల్లోని మట్టిరోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు రూ. 20.54 కోట్ల సీఆర్ఆర్ నిధులు మంజూరయ్యాయి. తొగుట మండలం మత్రికుంట-వర్ధరాజుపల్లి రోడ్డు నిర్మాణానికి రూ.1.70 కోట్లు, మెట్టు-బండారుపల్లి రోడ్డుకు రూ.2.25 కోట్లు, మిరుదొడ్డి మండలం మాదన్నపేట-జంగపల్లి మీదుగా ఆలయం వరకు రూ.1.70 కోట్లు, రాయపోల్ మండలంలోని రాయపోల్-తిర్మలాపూర్ పెద్దమ్మగుడి రోడ్డుకు రూ.3 కోట్లు, దౌల్తాబాద్ మండలంలోని ఉప్పరిపల్లి రోడ్డుకు రూ.1.70 కోట్లు, చేగుంట మండలం పోతాన్‌శెట్టిపల్లి-పెద్ద శివనూర్ రోడ్డుకు రూ.2.50 కోట్లు, రుక్మాపూర్- కరీంనగర్ రోడ్డుకు రూ.2.49 కోట్లు, బోనాల పిట్టల తండా రోడ్డుకు రూ.2.40 కోట్లు, నార్సింగ్ మండలంలోని నర్సంపల్లి వయా కాస్లాపూర్ చిన్నతండా రోడ్డుకు రూ.2.12 కోట్లు, జెడ్పీ రోడ్డు నుంచి జమ్లా తండా, పెద్ద తండా రోడ్డుకు రూ.90 లక్షలు మంజూరయ్యాయి.

సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు కృషితోనే..



దుబ్బాక నియోజకవర్గంలో అధ్వానంగా మారిన రోడ్లను బీటీ రోడ్లు మార్చేందుకు నిధులు మంజూరు చేయాలని సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావును కోరడంతో వారు స్పందించారు. రూ.20.54 కోట్లు మంజూరు చేశారు. నిధులు మంజూరు చేసినందుకు సీఎం, మంత్రికి ఆయా గ్రామాల ప్రజల తరపున కృతజ్ఞతలు. త్వరలో రోడ్ల నిర్మాణాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ

చాలా సంతోషంగా ఉంది



సిద్దిపేట-మెదక్ ప్రధాన రహదారి మధ్యన ఉన్న మత్రికుంట నుంచి మా గ్రామం వర్ధరాజుపల్లి 3 కిలోమీటర్లు ఉంటుంది. ఇది మట్టిరోడ్డు కావడంతో గుంతలమయంగా మారింది. దీంతో రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నాం. బీటీ రోడ్డు వేయాలని ఎన్నో ఏళ్ల నుంచి కోరుతున్నాం. ఇప్పుడు నిధులు మంజూరు చేశారు. చాలా సంతోషంగా ఉంది. ఎంపీకి కృతజ్ఞతలు.

– వంగాల మహిపాల్‌రెడ్డి, వర్ధరాజుపల్లి

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్: పట్టణంలోని మోడల్ స్కూల్‌లో 6 నుంచి 8వ తరగతి వరకు గంటల ప్రాతిపాదికన హిందీ (టీజీటీ) బోధించుటకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అన్నపూర్ణ శనివారం తెలిపారు. ఎంఏ హిందీ లేదా డిగ్రీతోపాటు హెచ్‌పీటీ, టీఈటీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈనెల 17వ తేదీన నిర్వహించే డెమోకు హాజరుకావాలన్నారు. అభ్యర్థులు ఈనెల 16వ తేదీలోపు దరఖాస్తు అందజేయాలని పేర్కొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం


సీఎం, మంత్రి, ఎంపీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

తొగుట(దుబ్బాక): మండలంలోని వర్ధరాజుపల్లి, బండారుపల్లి గ్రామాలకు బీటీ రోడ్లు నిర్మించేందుకు మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి నిధులు మంజూరు చేయించారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి తెలిపారు. శనివారం ఎంపీ ఫ్లెక్సీకి పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి ఎంపీ కృషిచేస్తున్నారన్నారు. వర్ధరాజుపల్లి మీదుగా మత్రికుంట వరకు 2 కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మించేందుకు రూ 1.70 కోట్లు, బండారుపల్లి నుంచి మెట్టు వరకు 2.9 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.25 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాజవ్వ, ఎల్లం, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, వైస్ చైర్మన్ రాంరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తండాల్లో రుతుప్రేమ


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్

నంగునూరు(సిద్దిపేట): మహిళలు మెన్సెస్ కప్పుల వాడటంవల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యానికి మేలు జరుగుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. శనివారం రాజగోపాల్‌పేట, పాలమాకుల, జేపీ తండా గ్రామాల్లో రుతుప్రేమ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ప్యాడ్స్, డైపర్ల వాడకంతో కలిగే అనర్థాలు, మెన్సెస్ కప్పుల వాడకం ప్రయోజనాలను మహిళలకు వివరించారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షకురాలు డాక్టర్ శాంతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, మండల నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి వినతి


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

చేర్యాల(సిద్దిపేట): ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని నియోజకవర్గ కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు శనివారం తెలిపారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైకుంఠధామం నిర్మిస్తున్నామని, వైకుంఠధామం వరకు సీసీ రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరినట్లు చెప్పారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యేని కలిసినవారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డి, పట్టణ ఆర్యవైశ్య యువజన విభాగం అధ్యక్షుడు అయిత సంపత్, పట్టణ ఆర్యవైశ్య సంఘం కోశాధికారి మంచాల ప్రవీణ్, కిరాణ వర్తక సంఘం అధ్యక్షుడు శేరి బాలనారాయణ, అయిత శంకర్ ఉన్నారు.

ముగిసిన సామాజిక తనిఖీ

సిద్దిపేటరూరల్: మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై చేపట్టిన సామాజిక తనిఖీ శనివారం ముగిసింది. ఆదివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ రెండో విడత సామాజిక తనిఖీ వివరాల వెల్లడికి ప్రజావేదికను ఏర్పాటు చేశారు. డీఆర్‌డీఏ పీడీ చంద్రమోహన్, మండల అధికారులు హాజరయ్యారు. గ్రామాల వారీగా చేపట్టిన పనులు, మెటీరియల్, కూలీ చెల్లింపు తదితర రికార్డుల వివరాలను డీఆర్‌పీలు అధికారులకు వివరించారు. రావురూకులలో రూ.18,534 అత్యధికంగా, చిన్నగుండవెల్లి, వెంకటాపూర్, మాచాపూర్, బండ చర్లపల్లిలో అతి స్వల్పంగా రికవరీ చేశారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ హరి, క్వాలిటీ కంట్రోలర్ సంతోష్ రెడ్డి, డీవీఓ ప్రభాకర్, ఎస్ఆర్పీ ప్రదీప్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు యాదగిరి, ఎంపీడీఓ రాఘవరెడ్డి, ఇన్‌చార్జి ఏపీఓ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఈసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు


గజ్వేల్‌లో ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేయాలి

గజ్వేల్‌రూరల్: గ్రూప్ 2 పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగుల పక్షాన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు మద్దతుగా శనివారం ఆ పార్టీ నాయకులు శనివారం నిరసన దీక్ష చేపట్టారు. తొమ్మిదేళ్లుగా ఉద్యోగాలను భర్తీ చేయకుండా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హడావిడిగా అన్ని పరీక్షలను నిర్వహించడంవల్ల నిరుద్యోగులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. గ్రూప్ 2 పరీక్షలను ప్రభుత్వం వాయిదావేయాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు కరుణాకర్, ఉపాధ్యక్షుడు ఓంప్రకాష్, ఇన్‌చార్జిలు నరేష్, వినోద్, అసెంబ్లీ ఉపాధ్యక్షుడు ఎల్లం, ప్రధాన కార్యదర్శి రమణ, కోశాధికారి కరుణాకర్, సభ్యులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో..

సిద్దిపేటకమాన్: గ్రూప్ 2 పరీక్షను ప్రభుత్వం వాయిదా వేయాలని బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గ్రూప్2 పరీక్ష వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను పోలీసులు గృహ నిర్బంధం చేయడంతో ఆయన మద్దతుగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం బీఎస్పీ నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాకురి అశోక్, ప్రధాన కార్యదర్శి మల్లేశం, భాను, హరికిరణ్, శంకర్ పాల్గొన్నారు.

క్రీడాకారులు సత్తా చాటాలి

- ఏజెడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు

గజ్వేల్‌రూరల్: క్రీడాకారులు పోటీల్లో సత్తా చాటాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఐఓసీ సమీప మైదానంలో ఏజెడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కబడ్డీ పోటీలను ఏసీపీ రమేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడారంగానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏజెడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జుబైర్‌పాష, గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కమిటీల దృష్టికి అంగన్‌వాడీల సమస్యలు


నూతన కమిటీతో టీఎన్‌జీఓ చేర్యాల అధ్యక్షుడు హరిప్రసాద్

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ చేర్యాల ప్రాజెక్టు నూతన కమిటీ ఎన్నిక శనివారం జరిగింది. ఈ ఎన్నికలు టీఎన్‌జీఓ చేర్యాల అధ్యక్షుడు హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్ప, జిల్లా ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, జిల్లా సలహాదారులు అంబమ్మ, భాగ్య ఆధ్వర్యంలో జరిగాయి. ప్రాజెక్ట్ కమిటీ నూతన అధ్యక్షురాలిగా అరుణ, ఉపాధ్యక్షురాలిగా సరోజన, కార్యదర్శిగా అనిత, కోశాధికారిగా సుజాత, సలహాదారులుగా శోభ, యాకమ్మ, ప్రచార కార్యదర్శిగా సరళ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను జిల్లా, రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలన్నారు.

అభివృద్ధి వివరించాల్సిన బాధ్యత మీదే

- ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

కోహెడ(హుస్నాబాద్): రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యమని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. శనివారం మండల స్థాయి కార్యకర్తల సమావేం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత కార్యకర్తలదే అన్నారు. అనంతరం సొంత డబ్బులతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తాగునీటి బోరుబావిని ప్రారంభించారు. ఆలయం నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కర్ర శ్రీహరి, ఆవుల మహేందర్, ఎంపీపీ కొక్కుల కీర్తి, జెడ్పీటీసీ సభ్యులు శ్యామల, దేవేందర్‌రావు, శ్రీకాంత్, కుమారస్వామి, లక్ష్మయ్య, రాజేశ్వర్‌రావు, మధుసుదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయం

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నేత సత్యనారాయణ

గజ్వేల్‌రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎస్‌టీఎఫ్ఐ కృషి చేస్తోందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు సత్యనారాయణ పేర్కొన్నారు. టీఎస్‌యూటీఎఫ్ గజ్వేల్ డివిజన్ కార్యాలయంలో ఎస్‌టీఎఫ్ఐ (స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) 24వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌టీఎఫ్ఐ 23 ఏళ్లుగా జాతీయ స్థాయిలో విద్యాసమస్యలపై నిరంతర పోరాటం చేస్తోందన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించడంలో టీఎస్‌యూటీఎఫ్, ఎస్‌టీఎఫ్ఐ పని చేస్తూ లక్ష్యసాధలో ముందుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వలీఅహ్మద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం నిరంతర పోరాటం

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో విద్యార్థి సంఘాల నాయకులు

చేర్యాల(సిద్దిపేట): ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేష్ ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో తొలి విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సమైక్య(ఏఐఎస్ఎఫ్)అని అన్నారు. విద్య కాషాయీకరణ, కార్పొరేటీకరణ, మహిళలపై లైంగిక దాడులకు వ్యతిరేకంగా, సమాన విద్య, శాంతి, అభ్యుదయం, శాస్త్రీయ సోషలిజం, శాస్త్రీయ విద్యావిధానానికి ఉద్యమించే ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: విద్యారంగ సమస్యల పరిష్కారం, విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న తొలి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఆ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చిట్యాల శేఖర్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం హుస్నాబాద్‌లో జెండా విష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు, పోరాడు నినాదంతో శాంతి, అభ్యుదయం, శాస్త్రీయ విద్యావిధానం లక్ష్యాలుగా పోరాటాలు చేస్తున్న ఏకైక సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. ప్రభుత్వాలు విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని ఆరోపించారు.


చేర్యాలలో నినాదాలు చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు రూపేష్, తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: విద్యార్థి సంఘాలను చూసి రాష్ట్ర ప్రభుత్వం జంకుతోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగెం మధు అన్నారు. అందుకే ప్రభుత్వ విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాలకు అనుమతి ఇవ్వడం లేదని ఆరోపించారు. శనివారం దుబ్బాకలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మిట్టపెల్లి సుధాకర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కోహెడ(హుస్నాబాద్): ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు వేల్పుల శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించారు.

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ విద్యను పరిరక్షించేందుకు ఏఐఎస్ఎఫ్ నిరంతర పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్ పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం ఇందిరాపార్కు చౌరస్తా వద్ద ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు.

సిద్దిపేటజోన్: విద్యార్థుల హక్కులు, విద్యారంగ పరిరక్షణకు ఏఐఎస్ఎఫ్ కృషి చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ పేర్కొన్నారు. శనివారం ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గాంధీ చౌక్‌లో జెండా ఆవిష్కరణచేశారు.

దళితబంధు నిలిపి వేయాలి

కొండపాక (గజ్వేల్): దళితబంధు పథకంలో మాదిగ కులస్తులకు కేటాయించిన యూనిట్ల లబ్ధిదారుల ఎంపిక నిలిపి వేయాలని కోరుతూ కుకునూరుపల్లి మండలం తిప్పారం గ్రామ దళిత మహిళలు శనివారం సీఎం, కలెక్టరు కార్యాలయానికి, పోలీస్టేషన్‌కు వినతి పత్రాలను పంపారు. వివరాలు ఇలా ఉన్నాయి. దళితబంధు పథకంలో తిప్పారం గ్రామానికి 11 యూనిట్లు మంజూరయ్యాయి. మదిర గ్రామం సింగారం గ్రామానికి 3, తిప్పారంలోని ఎస్సీ మాల కులస్తులకు 3 యూనిట్లు, మాదిగ కులస్తులకు 5 యూనిట్లుగా కేటాయించాలని స్థానిక ప్రజాప్రతినిధులు నిర్ణయం తీసుకున్నారు. మాదిగ కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని, ఎక్కువ యూనిట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేటాయించిన 5 యూనిట్లు కూడా అధికార పార్టీ పెద్దలు నిరుపేదలకు దక్కకుండా ప్రయత్నిస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు.

జయప్రదం చేయాలి



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈనెల 25, 26 తేదీల్లో పట్టణంలో నిర్వహించే అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపీఎస్‌యూ) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏఐపీఎస్‌యూ జిల్లా కన్వీనర్‌లు ఒగ్గు రమేష్, జోగారి రాజు పిలుపు ఇచ్చారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐపీఎస్‌యూ జిల్లా నాయకులు అక్షయ్, శివ, ప్రణయ్, రాజు, రవళి, శ్రేష్ట తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


యాదయ్య

దుబ్బాకరూరల్: మండలంలోని పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఎస్ఐ గంగరాజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 11వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో భోజనం చేసి ఇంట్లో నిద్రించాడు. 11.30 గంటలకు భార్య భాగ్యమ్మకు ఫోన్ చేసి బ్రతుకుదెరువుకు వెళ్తున్నానని చెప్పి ఫోన్ కట్‌చేశాడు. భాగ్యమ్మ ఫోన్ చేయగా సిద్దిపేటకు వెళ్తున్నానని తెలిపాడు. మళ్లీ ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ వచ్చింది. తెలిసినవారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో భాగ్యమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. యాదగిరి ఆచూకీ తెలిసినవారు ఫోన్ నంబర్ 9948435737కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

సంక్షిప్త వార్తలు

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

తొగుట(దుబ్బాక): కాంగ్రెస్ పార్టీ తుక్కాపూర్ గ్రామ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బర్రెంకల స్వామి, ఉపాధ్యక్షుడిగా జహంగీర్, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా వెంకట్, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా గోపాల్, ఉపాధ్యక్షుడిగా స్వామి, సోషల్ మీడియా కన్వీనర్‌గా మహేష్, యూత్ అధ్యక్షుడిగా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా స్వామి ఎన్నికయ్యారు.

స్వచ్ఛ సిద్దిపేటలో భాగస్వాములు కావాలి

సిద్దిపేటకమాన్: స్వచ్ఛ సిద్దిపేటలో ప్రజలు భాగస్వాములు కావాలని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు పిలుపు ఇచ్చారు. నడుస్తూ చెత్త తొలగిద్దాం కార్యక్రమంలో భాగంగా 39వ వార్డులో వార్డు కౌన్సిలర్ దీప్తినాగరాజు, కౌన్సిలర్లతో కలిసి శనివారం చెత్తను తొలగించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని అవగాహన కల్పించారు.

కేంద్ర బృందం పర్యటన

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని అంతక్కపేట, కేశవాపూర్ గ్రామాల్లో శనివారం కేంద్ర స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటించింది. గ్రామస్తులతో ముచ్చటించారు. పారిశుధ్య నిర్వహణ, డంపింగ్ యార్డ్‌లో తడి, పొడి చెత్త వేరుచేసే అంశం, మరుగుదొడ్లు, పాఠశాల, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ భవనాలను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణకు డ్రైనేజీలను ఏర్పాటు చేయడం బాగుందన్నారు. వారి వెంట ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్ రెడ్డి, ఎంపీఓ కవికుమార్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పాతపెన్షన్ పునరుద్ధరించాలి

గజ్వేల్: సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పాతపెన్షన్ సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన పాత పెన్షన్ సాకార సభకు గజ్వేల్ నుంచి 220 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తరలివెళ్లారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్సీకి వినతి

మర్కూక్(గజ్వేల్): మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్, బాల్‌రాజు, నర్సింలు, పాండుసింగ్, దుర్జన్ సింగ్, విజయ్‌సింగ్ శనివారం ఎమ్మెల్సీ యాదవ రెడ్డిని కలిసి గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్సీ గ్రామంలో హైమాస్టు లైట్లు ఏర్పాటు చేస్తామని, అలాగే రేషన్ బియ్యం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెస్తాం

మర్కూక్(గజ్వేల్): కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెస్తామని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దామరకుంట గ్రామ నూతన కమిటీని మండలాధ్యక్షుడు కనకయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పత్తి నర్సింహులు, ఉపాధ్యక్షుడిగా ప్రభు, యువజన అధ్యక్షుడిగా శ్యామ్‌లతో పాటు వివిధ కమిటీలను ఎన్నుకున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నట్లు ఎంపీపీ మాణిక్యరెడ్డి, సర్పంచ్ సుభాష్ తెలిపారు. శనివారం గ్రామంలో పర్యటించి మంత్రి ప్రారంభించే కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీ భవనం, మహిళా భవనం, రైతు వేదిక భవనాలను ప్రారంభిస్తారని తెలిపారు.

ఓడిపోతామనే కొత్త పథకాలు

గజ్వేల్‌రూరల్: రానున్న ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్తకొత్త పథకాలను ప్రవేశపెడుతోందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ ఆరోపించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతూ బీఆర్‌ఎస్ పాలన సాగిస్తుందన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో ప్రజలకు ఒరగబెట్టిందేం లేదని విమర్శించా. ఎన్నికలు సమీపిస్తుండటంతో దళితబంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు, గృహలక్ష్మి పథకాలను తెచ్చినట్లు తెలిపారు. ఆ పథకాలు కూడా అధికార పార్టీకి చెందిన వారికే కేటాయిస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గ లబ్ధిదారుల జాబితాపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

